RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

అన్వేషనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 117 | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



వాస్తవాలను

## దాస్తున్నారు.. కేంద్రంపై ఎంపీ జైరాం రమేశ్ విమర్శలు

భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీపై రాజ్యసభ ఎంపీ జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

2




ఇండిగో విమానానికి

## తప్పిన ముప్పు.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే..

గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

2



విజయ్ ఫర్ పీఎం..

## టీవీకే-కాంగ్రెస్ మధ్య విభేదాలు ముదురుతున్నాయా..

తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురావాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. ఈ నినాదం కారణంగా టీవీకే, కాంగ్రెస్ మధ్య విభేదాలు మొదలైనట్టు వార్తలు వస్తున్నాయి. టీవీకే కార్యకర్తలు, నేతల నుంచి వినిపిస్తున్న 'విజయ్ ఫర్ పీఎం' నినాదంపై కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్‌ను గ్లోబల్

# నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు
- ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదం
- సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక
- ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు
- ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2 లో..



హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్(ఈ) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు.

7.8 శాతం వృద్ధి రేటు..

## దేశ ప్రజలకు అభినందనలు: ప్రధాని మోదీ



2

భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు.



## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హై కోర్టులో ఊరట

వార్త 2లో

ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు

## జరుపుకోవాలి: పొన్నం ప్రభాకర్

సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని.. ఉత్సవాల ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు.




2

కల్యాణలక్ష్మి, షాదీముబారక్

## పథకాలపై స్టే ఎత్తేసిన తెలంగాణ హైకోర్టు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. ఈరోజు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు.



2

ట్రంప్ సర్కారు కొత్త

## ప్రతిపాదన.. హెచ్-4 వీసాదారులకూ షాక్ తప్పదా?




2

# హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య


లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు

ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదం

సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక

ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు

ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అన్వేషణనేత్రం ప్రతినిధి

హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్(ఒ) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. వాదీూ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## 7.8 శాతం వృద్ధి రేటు.. దేశ ప్రజలకు అభినందనలు: ప్రధాని మోదీ

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు.

## వాస్తవాలను దాస్తున్నారు.. కేంద్రంపై ఎంపీ జైరాం రమేశ్ విమర్శలు

ఇంటర్నెట్ డెస్క్:

భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీపై రాజ్యసభ ఎంపీ జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తుతోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటీమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

## ఇండిగో విమానానికి తప్పిన ముప్పు.. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే..

న్యూఢిల్లీ,

గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం (6జు 2102) అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. ఈ విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

## విజయ్ ఫర్ పీఎం.. టీవీకే-కాంగ్రెస్ మధ్య విభేదాలు ముదురుతున్నాయా..

ఇంటర్నెట్ డెస్క్:

తమిళగ వెట్రి కళగం (ఒఖ) అధినేత, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురావాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. ఈ నినాదం కారణంగా టీవీకే, కాంగ్రెస్ మధ్య విభేదాలు మొదలైనట్టు వార్తలు వస్తున్నాయి. టీవీకే కార్యకర్తలు, నేతల నుంచి వినిపిస్తున్న 'విజయ్ ఫర్ పీఎం' నినాదంపై కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు 2029 లోక్‌సభ ఎన్నికల్లో విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురావాలని తమిళనాడులోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు కనిపిస్తున్నాయి. టీవీకే కార్యకర్తల్లో ఈ ప్రచారం క్రమంగా ఊపందుకుంటోంది. ప్రతిపక్ష కూటమి తరఫున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థిగా ఉండనున్నారు. దీంతో విజయ్ వర్సెస్ రాహుల్ గాంధీ అంశం తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేయడంపై తమిళనాడు కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారుటీవీకే ప్రభుత్వానికి ప్రస్తుతం కాంగ్రెస్ సహా కొన్ని మిత్రపక్షాల మద్దతు కీలకం. ఈ నేపథ్యంలో విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకురావాలన్న టీవీకే కార్యకర్తల ప్రచారం రెండు పార్టీల సంబంధాలను మరింత సంక్లిష్టంగా మార్చే అవకాశం ఉంది. టీవీకే–కాంగ్రెస్ మధ్య విభేదాలపై చర్చ జరుగుతున్న సమయంలో తమిళనాడు అసెంబ్లీలో కూడా కీలక మార్పు చోటుచేసుకుంది. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత తారహై కుత్‌బర్ట్ సీటును టీవీకే సభ్యులకు కేటాయించిన విభాగం నుంచి ప్రతిపక్ష బెంచీల ముందు వరుసకు మార్చారు. ఈ మార్పు వెనుక రాజకీయ కారణాలున్నాయన్న ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే కుత్‌బర్ట్ మాత్రం ఆ వాదనను ఖండించారు. తనకు కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా కొత్త బాధ్యత రావడంతోనే సీటింగ్‌లో మార్పు జరిగిందని స్పష్టం చేశారు. టీవీకే–కాంగ్రెస్ మధ్య తీవ్రమైన విభేదాలు లేవని కుత్‌బర్ట్ స్పష్టం చేశారు. విజయ్, రాహుల్ గాంధీ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'విజయ్ ఫర్ పీఎం' అనేది టీవీకే పార్టీ అధికారిక నిర్ణయం కాదని, కార్యకర్తల నుంచి వచ్చిన నినాదమేనని తెలిపారు.

## ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలి: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,

సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని.. ఉత్సవాల ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, చేనేత కండువాలు వాడాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితిని కోరామన్నారు. మట్టి వినాయకులను వాడి... పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల సమయంలో మంచి వర్షాలు కురవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల్లో ఎల్‌నినో కష్టాల నుంచి గట్టెక్కించి.. మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు. కోర్టులను గౌరవిస్తూనే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హై కోర్టులో ఊరట

హైదరాబాద్,

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై స్టే ఎత్తేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్,

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై హైకోర్టు సింగిల్ ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయగా.. ఈరోజు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలపై సింగిల్ బెంచ్ స్టే విధించడం వల్ల పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పథకం వల్ల ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు మేలు జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పథకాల చట్టబద్ధతను సవాల్ చేస్తూ సింగిల్ బెంచ్‌లో వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని తెలిపారు. పథకం అమలుపై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన సీజే ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## ట్రంప్ సర్కారు కొత్త ప్రతిపాదన.. హెచ్-4 వీసాదారులకూ షాక్ తప్పదా?

ఇంటర్నెట్ డెస్క్:

అమెరికాలో ఉపాధి పొందుతున్న విదేశీయులకు షాకిచ్చే మరో ప్రతిపాదనను ట్రంప్ సర్కారు సిద్ధం చేసింది. హెచ్–1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఉద్యోగానుమతిని నిలిపివేసే ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. హెచ్–1బీ వీసాదారుల జీవితభాగస్వాములు హెచ్–4 వీసా సాయంతో అమెరికాకు వెళతారన్న విషయం తెలిసిందే. ఆ తరువాత అక్కడ ఎంప్లాయ్‌మెంట్ ఆథొరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ) సాయంతో ఉపాధి పొందుతారు. అయితే, హెచ్–4 వీసాదారులకు అమెరికాలో ఉపాధికి అర్హత లేకుండా చేసే ప్రతిపాదన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) తెరపైకి తెచ్చింది. ఉపాధి పొందేందుకు అర్హత ఉన్న విదేశీయుల జాబితా నుంచి హెచ్–4వీసాదారులను తొలగించాలన్నది ఈ ప్రతిపాదన సారాంశం. అయితే, ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఈ అంశాన్ని ప్రజల ముందుకు ఎప్పుడు తెస్తారనే విషయంలో ఎలాంటి టైమ్ టేబుల్ ప్రభుత్వం నిర్ణయించలేదు. 2017లోనే ట్రంప్ సర్కారు హెచ్–4 వీసాదారులపై ఆంక్షలకు ప్రయత్నించింది. హెచ్–4 వీసాదారులకు అమెరికాలో జాబ్స్‌కు అర్హత లేకుండా చేద్దామనుకుంది. కానీ వివిధ కారణాలతో 2021లో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం హెచ్–4 వీసాదారులు ఎప్పటివలెనే ఈఏడీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే మాత్రం అక్కడి భారతీయ కుటుంబాలపై అధిక ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. హెచ్–1బీ వీసాదారుల్లో 71 శాతం మంది భారతీయులన్న విషయం తెలిసిందే.

## 'ఆపరేషన్ సిందూర్'లో అదరగొట్టిన ఎస్-400కు మరో ఆర్డర్!

ఇంటర్నెట్ డెస్క్:

'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్–400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్–400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్–400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్–400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్–400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్–400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్–400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్–400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోంది.

# ఎల్ఐసి 70 ఏళ్ల సంబరాలు

## రైతుల వ్యవసాయ అవసరాలకు సహకార సంఘం ద్వారా రుణాలు

**రూ.31.80 లక్షల విలువైన రుణ చెక్కులు అందజేసిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



రైతుల వ్యవసాయ అవసరాలకు ఆర్థిక సహకారం అందించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా కర్షక మిత్ర రుణాలు మంజూరు చేసినట్లు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సహకార సంఘం కార్యాలయంలో రుణాలు మంజూరైన రైతులకు చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్యతో కలిసి రుణ చెక్కులను అందజేశారు. రైతులకు వ్యవసాయ పనులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడమే సహకార సంఘం ప్రధాన లక్ష్యమని కొత్త శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం ద్వారా మరిన్ని రుణ సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పర్షవేన సంతోష్‌కు రూ.7.80 లక్షలు, మీసాల రవి, పర్షవేన బాలరాజు, నాగుల జగన్, అనవేన రాజేశ్వరికి రూ.6 లక్షల చొప్పున రుణాలు మంజూరు కాగా, వారికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు, రుణ లబ్ధిదారులు పాల్గొన్నారు.





## ఘనంగా ఎల్ఐసి 70 వ వార్షికోత్సవ వేడుకలు

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి )70 వ వార్షికోత్సవ వేడుకలు సౌత్ జోనల్ కార్యాలయం లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రధాన కార్యాలయంలో జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ గారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి, ఈ వేడుకలకు ప్రముఖ వ్యాపారవేత్త వాసవి కన్స్ట్రక్షన్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ యర్రం విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన రీజనల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్ఐసికి విలువైన పాలసీదారుడుగా ఎన్నో సంవత్సర సంవత్సరాలుగా అనుబంధం ఉన్న ఎర్రం విజయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే విధంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని విజయ్ కుమార్ తెలిపారు. ఎల్ఐసి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, మార్కెటింగ్ ఏజెంట్లు, డెవలప్మెంట్ ఆఫీసర్లను, ఎల్ఐసి ఏజెంట్లను ఆయన అభినందించారు. ఎల్ఐసి గ్యారెంటీకి, విశ్వాసానికి, పవిత్రతకు, ఆర్థిక భద్రతకు ప్రత్యేకంగా నిలిచిన సంస్థ ఎల్ఐసి అని ఆయన తెలిపారు. పిల్లల భవిష్యత్తుకు, విద్యాభ్యాసం, ఉన్నత విద్య, వివాహం, కుటుంబార్థిక భద్రతకు, పదవి విరమణ అనంతరం ఎల్ఐసి ఎంతో అవసరమని చెప్పారు. ఎల్ఐసి 70 వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా సందర్భం సేవలు అందిస్తున్న తెలియజేశారు. అదేవిధంగా జీవిత బీమా సంస్థను విశ్వసించే తమ కష్టార్జిత సంపాదనను పొదుపుగా భద్రత పొందుతున్న కోట్లాదిమంది పాలసీదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కౌటికే విఠల్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలు నిజమైన బలం అసలైన ముఖచిత్రం జీవిత బీమా అని కౌటికె విటల్ తెలిపారు. ఏజెంట్లు సంతృప్తిగా ఉత్సాహంగా పనిచేసినప్పుడే సంస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.

## మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రుల్లో డిఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆకస్మిక తనిఖీలు




మంచిర్యాల జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు, ల్యాబ్‌లు తప్పనిసరిగా 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్' ప్రకారం నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని సిటీ న్యూరో, శ్రీహర హాస్పిటల్, ఆదిత్య హాస్పిటల్, మరియు సచిన్ హాస్పిటళ్లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, సీఎం రిలీఫ్ ఫండ్ (సిఎంఆర్ఎఫ్) కింద అందిస్తున్న చికిత్సలు, పంపించిన వైద్య బిల్లుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నాలుగు ఆస్పత్రుల్లో లభిస్తున్న వైద్య సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పనిచేసే స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు, అందించే వైద్య సేవలకు వసూలు చేసే ఛార్జీల పట్టికను అందరికీ కనిపించేలా గోడలపై అతికించాలి. రోగులకు తాగునీరు, ఆసనాలు, వీల్ చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉంచాలి. ప్రతి ఆస్పత్రిలో బయో-మెడికల్ వేస్ట్ సర్టిఫికేట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ లైసెన్స్, లీజు పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి. పారామెడికల్ సిబ్బంది వివరాలను లేబర్ కమిషనర్‌కు సమర్పించాలి. ఆస్పత్రికి వచ్చే విజిటింగ్/కన్సల్టెంట్ వైద్య నిపుణుల వివరాలపై ప్రత్యేక బ్యానర్లు ఏర్పాటు చేయాలి. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత వైద్యులు డాక్టర్ అబ్బురి శ్రీనివాస్, డాక్టర్ గంప మల్లేష్, డాక్టర్ ప్రతాప్ గౌడ్, డాక్టర్ వినోద్ మరియు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 70వ క్రీడా సంబరాలు

**దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం**






ముత్తారం రిపోర్టర్ముత్తారం మండలంలోని దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ ఢ జూనియర్ కాలేజీలో 70వ వా+ఖీ (వాఎష్ట్రశీశీ్ర +ఖఎవం ఖీవసవతీఫ్‌ఙశీఅ) క్రీడా సంబరాల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కోకో, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో వీజూూ హరి ప్రసాద్, వా× రవి, సర్పంచ్ రాపెల్లి రాజయ్య, దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్ కుమార్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అలాగే మండల వా+ఖీ కార్యదర్శి కే. వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు స్వప్న, రజిత, దుర్గాభవాని, శ్రీమన్ తదితరులతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేశారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

## అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి --- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారి 63 రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి డి.ఎ.ఓ. రమేష్ తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి ---- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



భూ వివాదాల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమిని మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియపై మండల తహసిల్దార్, సర్వేయర్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే చేసిన విస్తీర్ణానికి సంబంధించి కొ-రిలేషన్ స్టేట్‌మెంట్‌ను పూర్తి చేయాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోగా ఎలాంటి జాప్యం లేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేసి పకడ్బందీగా చేపట్టాలి---జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించి భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. బెల్లంపల్లి మండల కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని చాకేపల్లి గ్రామంలో మండల తహసిల్దార్ కృష్ణ, సర్వే అధికారులు తో కలిసి రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టంను తీసుకువచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని , భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 11 నాన్ కడస్టల్ గ్రామాలు, 70 కడస్టల్ గ్రామాలు మొత్తంగా 81 గ్రామాలు రీ -సర్వేకు ఎంపిక కావడం జరిగిందని, తెలంగాణ సర్వే ఢ బౌండరీ చట్టం ప్రకారం రీ - సర్వే నిర్వహించడం జరుగుతుందని, చట్టం గురించి అవగాహన కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. గ్రామసభల ద్వారా పట్టదారులకు సమాచారం అందించాలని, మొదట గ్రామసభ నిర్వహించి ప్రజలకు సమాచారం అందించి గ్రామ సరిహద్దును నిర్ణయించాలని, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ సంబంధిత భూములను సాధారణ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జి.పి.ఓ.ల ఆధ్వర్యంలో గుర్తించాలని తెలిపారు. తదుపరి సర్వే బృందంతో పాటు రెవెన్యూ బృందాలు ఏర్పాటు



చేసి సర్వే నిర్వహించడం, సర్వే సమయంలో ఖచ్చితంగా ఫీల్డ్ రిజిస్టర్ నిర్వహించాలని, సంబంధిత జిపిఓలు అందుబాటులో ఉండి వివరాలను రికార్డు చేయడం ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కరణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని సర్వే పనులను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచ్ లు, రైతులకు అందించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి నిర్ణీత ప్రొఫార్మాలో ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం తాండూర్ మండలం మధునాపూర్ గ్రామ శివారులో వరి సాగు చేస్తున్న రైతులతో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మండల తహసిల్దార్ జ్యోత్స్నతో కలిసి మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు మాట్లాడుతూ తమ పొలాలకు సమీపంలో చెరువు ఉందని, అందువల్లనే వరి సాగు చేస్తున్నామని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల ప్రక్రియ నిర్వహణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ జాబితాలో నోటీసులు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియను వేగవంతం చేసి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఉద్యోగులు పేర్లు నమోదు చేసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ (ఏఐసిఎస్) క్రీడా పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడానికి జిల్లా స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి (డివైఎస్ఓ), మంచిర్యాల ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖో-ఖో తదితర 19 క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రమే ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు తాము పాల్గొనదలచిన క్రీడాంశంలో 2026 సెప్టెంబర్ 3వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని డివైఎస్ఓ కోరారు. ఎంపిక ప్రక్రియకు సంబంధించిన తదుపరి సమాచారం మరియు తేదీలను నమోదు చేసుకున్న ఉద్యోగులకు తెలియజేయబడుతుంది. కావున మంచిర్యాల జిల్లాలోని అర్హత కలిగిన అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్ణీత గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి విజ్ఞప్తి చేశారు. నమోదు కోసం కోసం, రాజేష్, సెల్ నెంబర్: ం919963539234 కి కాల్ చేసి వివరాలు తెలుపాలని మంచిర్యాల జిల్లా జిల్లా యువజన, క్రీడల అధికారి (డివైఎస్ఓ) ఒక ప్రకటన లో తెలిపారు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# తెలంగాణలో కమలనాథుల పీఛేముడ్!




ఉత్తరాది పూర్తిగా తమ కైవసం అయిందని, ఇక దక్షిణాది మీద దండయాత్ర మిగిలిందని కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ సంబరపడిపోతున్న సమయంలో, 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో జెన్ జీ రోడ్ల మీదికి వచ్చి బీజేపీ ఆశల మీద నీళ్లు చల్లింది. అదే ఉత్తరాదిలో ఇటీవల పలు రాష్ట్రాల్లో జెన్ జీ ఉద్యమం స్ఫూర్తిగా జెన్ ఆల్ఫా కూడా రోడ్ల మీదికి వచ్చి ఉద్యమాలు మొదలుపెట్టింది. పాఠశాలల్లో పరిస్థితులు బాగాలేవని, కనీస వసతులు కల్పించాలని, సరైన ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని, గత మూడు వారాలలో పాఠశాల విద్యార్థులు తరగతి గదుల్లోంచి బయటకొచ్చి ప్రభుత్వ కార్యాలయాలకు ఊరేగింపులు తీసారు. స్కూలు గేట్లకు తాళాలు వేశారు. అధికారుల నుంచి సమాధానం కోరుతూ రోడ్లమీద బైఠాయించారు. వారి డిమాండ్లు చాలా మౌలికమైనవి. వాళ్లకు పాఠాలు సరిగ్గా చెప్పే ఉపాధ్యాయులు కావాలి. తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, రాసుకోవడానికి అవసరమైన బల్లలు, సరైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, వాడటానికి వీలుగా ఉండే మరుగుదొడ్లు ఈ జెన్ ఆల్ఫా కనీస కోర్కెలు. ఇంకొక పాఠశాల వారైతే స్కూలుకు వెళ్లడానికి సరైన రోడ్డు వేయాలని డిమాండ్ చేసారు. ఇవన్నీ గొంతెమ్మ కోర్కెలు కావు కదా. ఆ పిల్లలు అడగకుండానే ఈ ఏర్పాట్లన్నీ చెయ్యాల్సిన బాధ్యత వాళ్ళ తల్లిదండ్రులు ఓట్లేసి ఎన్నుకున్న ప్రభుత్వాలది కదా. గత మూడు వారాలుగా జెన్ అల్ఫా చేస్తున్న ఈ ఉద్యమాలు భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర , మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే జరిగాయి. రాజస్థాన్ హైకోర్టు అయితే దాదాపు 86,934 తరగతి గదులు సక్రమంగా లేనందున మూసివేయాలని ఆదేశాలు జారీ చేయడం చూశాం. జెన్ జీ స్ఫూర్తిగా జెన్ అల్ఫా చేస్తున్న ఈ 'స్కూల్ లీక్ కరో' ఉద్యమం అధికార బిజెపికి ఉత్తరాదిన ఊపిరాడని పరిస్థితి సృష్టించింది. బిజెపి, ఆర్ఎస్ఎస్ పదేపదే వల్లెవేసే మన పురాణాల్లో ఒకటైన వామనావతారాన్ని వాళ్లకు బీహార్ రాజధాని పట్నాలో ఆరేళ్ల ఆదిత్య కుమార్ చూపించేశాడు. వామనులు, ప్రహ్లాదులు.. ఇప్పుడు ఆదిత్య కుమార్ వంటి చిన్నవాళ్ళేం చేస్తారులే అనుకుంటే ఫలితం ఎలా ఉంటుందో అప్పుడు చూసాం, ఇప్పుడూ చూస్తున్నాం. బలి చక్రవర్తి నెత్తిన తన వామపాదం పెట్టి తొక్కిన వామనుడి అంశగా కనిపించి ఉంటాడు ఈ ఆదిత్య కుమార్ అనే బుడతడు. హిమాలయం బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి రాజీనామా కోరుతూ అందుకు కారణాలను ఆదిత్య కుమార్ ఏకరువు పెట్టి బిజెపికి చుక్కలు చూపించాడు. ఆరేళ్ల పసివాడిని అదుపులోకి తీసుకొని, ఆ పిల్లవాడి తల్లిదండ్రులను నిర్బంధించి హింసించడాన్ని సామాజిక మాధ్యమాలు విస్తృత ప్రచారం చేసి ఉత్తరాదిన పోలీసు వ్యవస్థ ఎంత అరాచకంగా తయారయిందో ప్రపంచానికి తెలియజెప్పి బీజేపీ ప్రభుత్వాల పరువు తీసాయి. ఆరేళ్ళ పిల్లవాడిని నిర్బంధించి బీహార్ పోలీసులు ఏం సాధించినట్టు? దక్షిణాదిన కేరళ, తమిళనాడు రాష్ట్రాల మీద ఆశ వదులుకున్న బిజెపి ఆంధ్రప్రదేశ్ లో ఏకోశానా నమ్మదగని తాత్కాలిక మిత్రుడి తోక పట్టుకొని ముందుకుపోతున్న స్థితిలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీద పెట్టుకున్న ఆశలు, అధికారం కోసం కన్న కలలు కూడా నెరవేరవని ఎట్టకేలకు అర్థం చేసుకున్నట్టుంది. 2024లో సగానికి సగం లోకసభ సీట్లు గెలిచిన నాటి జోష్ ఏమాత్రం మిగలని స్థితికి చేరిన బిజెపి తెలంగాణలో త్వరలో పట్టణ ప్రాంతాల్లో జరగనున్న కార్పొరేషన్ల ఎన్నికల్లో తమ సత్తా చాటుకునే వ్యూహాలు రచిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. మరెందుకు ఇటీవల ప్రకటించిన పార్టీ నూతన జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు చోటు లేకుండా చేసింది? ఏం చేసినా తెలంగాణలో అధికారంలోకి రాలేం కాబట్టి తమ శక్తియుక్తులను అక్కడ వృథా చేసుకోవడం అనవసరమని భావించిందా? ఇది తప్పనిసరిగా జనంలోకి వ్యతిరేక సంకేతాలు పంపించే చర్య. ఇదిలాఉంటే ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనను సగంలోనే ముగించుకొని తిరిగిరావడానికి కేంద్రమే కారణమై కాంగ్రెస్ పార్టీకి మరో అస్త్రాన్ని అందించినట్టయింది. రేవంత్ రెడ్డి 10 రోజుల పాటు యునైటెడ్ కింగ్డమ్ (యుకే), అమెరికా దేశాల్లో 'తెలంగాణ రైజింగ్' పేరిట అధికారిక పర్యటన కోసం లండన్ వెళ్లారు. అక్కడి నుండి బోస్టన్, న్యూయార్క్ వెళ్లి ఆగస్టు 30న తిరిగి రావాల్సింది. రాష్ట్రప్రభుత్వం ముఖ్యమంత్రి పర్యటనకోసం నిబంధనల ప్రకారం విదేశాంగ మంత్రిత్వశాఖ నుండి అధికారికంగానే అనుమతి కోరింది. అయితే కేంద్రం యూకే పర్యటనకు అనుమతి ఇచ్చి రాజకీయ కోణంలో అమెరికా పర్యటనకు నిరాకరించి కాంగ్రెస్ చేతికి ఒక దివ్యాస్త్రాన్ని ఇచ్చేసింది. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతించకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 23న హైదరాబాద్ తిరిగి వచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఉద్దేశించిన తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించి తెలంగాణను అవమానించిందని, వివక్షకు గురి చేసిందని ప్రకటించారు. ప్రధానమంత్రికి ఎరుక లేకుండానే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు విదేశాంగశాఖ అధికారులు అనుమతి నిరాకరించగలరా అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నకు అవతలనుండి సరైన జవాబు లేదు. అంతేకాదు, పట్టుమని పది రోజుల ముందు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ 'వైబ్రంట్ గుజరాత్' పేరుతో పెట్టుబడుల సముపార్జన కోసం అమెరికా, కెనడా దేశాల్లో ఎనిమిది రోజులు పర్యటించడానికి అనుమతి ఎలా ఇచ్చారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా స్వరాష్ట్రమైన గుజరాత్ కు పెట్టుబడులు తెచ్చుకునేందుకు తెలంగాణకు అన్యాయం చేశారనే అభిప్రాయం రేవంత్ రెడ్డికి అనుమతి నిరాకరించడంతో తెలంగాణ ప్రజల్లోకి బలంగానే వెళ్లింది.

# మార్కెట్లోకి న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్

## ఆవిష్కరించిన రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అనంతపురం : అనంతపురం ఆర్ ఎఫ్ రోడ్ లోని శివ సాయి హెూండా షోరూంలో ఇటీవల హెూండా సంస్థ రూపొందించిన న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్ సరికొత్త ద్విచక్ర మోడల్స్ ను రాష్ట్ర రవాణా, యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %% యువతకు నచ్చే విధంగా హెూండా సంస్థ వాహనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శివ సాయి హెూండా సంస్థ 21 సంవత్సరాలుగా సుదీర్ఘమైన సేవలు అందించి ప్రజల ఆదరణ పొందడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో 21 వ వార్షికోత్సవం సందర్భంగా తీసిన లక్కీ డ్రా లో సత్య సాయి జిల్లా చెన్నే కొత్తపల్లికి చెందిన వంశీకృష్ణకు లక్కీ డ్రాలో లభించిన ఆపిల్ మొబైల్ ను మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ నేపథ్యంలో శివ సాయి హౌండా అధినేత మల్లికార్జున



మాట్లాడుతూ వాహనదారులకు శివ సాయి హెూండా రెండు దశాబ్దాలుగా సేవలందించి ఆదరణ పొందామని చెప్పారు. భవిష్యత్తులోనూ నాణ్యమైన నమ్మకమైన సేవలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ వీర్రాజు, సిటీ యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్ శివ సాయి హెూండా సేల్స్ మేనేజర్ శేషాద్రి, సర్వీస్ మేనేజర్ షఫీ, టాటా గోల్డ్ ఇన్చార్జ్ రావు, శివ సాయి హెూండా అకౌంటెంట్ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చులతో సతమతం

## అయోమయంలో 58 శాతం కుటుంబాలు

## వాల్డ్‌పానెల్ బై నుమెరేటర్ రిపోర్ట్

న్యూఢిల్లీ :

పెరిగిన ధరలు, ఖర్చులతో దేశంలోని సగంపైగా కుటుంబాలు సతమతం అవుతోన్నాయి. ఖర్చులను ఎలా అధిగమించాలో అర్థం కావడం లేదని 58 శాతం కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయని వాల్డ్‌పానెల్ బై నుమెరేటర్ రిపోర్ట్‌లో తెలిపింది. వినియోగదారులు ట్రెండ్స్‌ను పరిశోధించే ఈ గ్లోబల్ రీసెర్చ్ సంస్థ 6,000పైగా కుటుంబాల అభిప్రాయాలతో.. ఖర్చా 3.0 అనే అధ్యయనం చేసింది. ఆ వివరాలు.. 2025 మార్చితో ముగిసిన త్రైమాసికంలో భారతీయుల కుటుంబాల సగటు వ్యయాలు 14 శాతం పెరిగి రూ.56,135కు చేరింది. ఇది ఆదాయం కంటే ఎక్కువని వెల్లడించింది. 2022లో సగటు త్రైమాసిక ఖర్చులు సుమారు రూ.42,000గా ఉన్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలు, తక్కువ ఆదాయాలు గల వర్గాలు ఖర్చులలో ఏకంగా 18 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. అదే విధంగా నగరాల్లోని ఉన్నత ఆదాయ కుటుంబాల్లో కూడా త్రైమాసిక ఖర్చులలో 15 శాతం పెరుగుదల నమోదయ్యింది. భారతీయ కుటుంబాల్లో గత మూడేళ్లలో ఆర్థిక ఒత్తిడి విపరీతంగా పెరిగింది. వినియోగదారులు అవసరమైన ఖర్చులను, రుణ బాధ్యతలను సమతుల్యం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. "ఖర్చులు పెరుగుతున్న నగర, గ్రామీణ ప్రాంతాల్లో చాలా కుటుంబాలు అవసరమైన వస్తువులు, పొదుపు, రుణ చెల్లింపులకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. వినియోగదారులు తమ ఎంపికలలో మరింత జాగ్రత్తగా ఉంటున్నారు. బ్రాండ్‌లకు ఇది ఒక కీలక సమయం. వారు వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సరసమైన, అవసరమైన, బాధ్యతాయుతమైన విలువను అందించే విధంగా తమ వ్యూహాలను రూపొందించాలి." అని వరల్డ్‌ప్యానల్ బై న్యూమరేటర్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ కె రామకృష్ణన్ అన్నారు. దేశంలోని 58 శాతం కంటే ఎక్కువ గృహాలు ఖర్చులను నిర్వహించడంలో ఇబ్బంది పడుతున్నాయని తమ రిపోర్ట్‌లో తేలిందన్నారు. ఇది గత సంవత్సరం 38 శాతంతో పోల్చితే చాలా ఎక్కువన్నారు. కేవలం 17 శాతం కుటుంబాలు మాత్రమే సౌకర్యవంతంగా జీవిస్తున్నాయన్నారు. మిగిలినవారు ఏదో విధంగా ఖర్చులను నిర్వహిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లు కుంచించుకుపోతుండటంతో భారతీయ వినియోగదారులు తమ ఖర్చులను ప్రాథమిక అవసరాలపై కేంద్రీకరిస్తున్నారన్నారు. సుమారు 80 శాతం మంది అవసరమైన కిరాణా సామాగ్రిని మాత్రమే కొంటున్నట్లు తెలిపారు. చాలా మంది చౌకైన బ్రాండ్‌లకు మారుతున్నారు. ఆకస్మిక కొనుగోళ్లను తగ్గిస్తున్నారన్నారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# పేపర్‌పై 18 శాతం జిఎస్‌టి అనుచితం

## కాగితం విలాస వస్తువు కాదు

## తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆందోళన

బిజినెస్ బ్యూరో : కేంద్ర ప్రభుత్వం కాగితంపై 18 శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వేసిందని.. ఇది అనుచితమని తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషేక్ విజయవార్జీ అన్నారు. పేపర్ విలాస వస్తువు కాదని.. ఇది అత్యవసర వస్తువని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రచురణకర్తలు, ప్రింటర్లు, ప్యాకేజింగ్ పరిశ్రమ సహా సమాజంలో ఎంతో మంది ప్రతిరోజూ ఉపయోగించే ఒక అత్యవసర వస్తువు కాగితం అన్నారు. దీనిపై ఇటీవల జిఎస్‌టిని 18 శాతానికి పెంచడం వల్ల విద్య, సంబంధిత పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. కాగితం కేజీ రూ.70, జిఎస్‌టి ఐదు శాతం కలిపితే రూ.73.50 అవుతుందన్నారు. అదే 18 శాతం జిఎస్‌టి అయితే రూ.82.60 అవుతుందన్నారు. కిలోపై అదనంగా 12 శాతం భారం పడనుందన్నారు. నూతన జిఎస్‌టితో నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు, పరీక్ష పత్రాలు, ప్యాకేజింగ్, రోజువారీ ఉత్పత్తులపై అనేక రెట్లు పెరుగుతుందని చెప్పారు. దేశంలో కాగితం పరిశ్రమ అడవులను నరకడం లేదన్నారు. సొంతంగా చెట్లను సాగు చేస్తుందన్నారు. కాగితంపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు.



# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

## టిజిఇ జెఏసి ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం

### టీజీఇ జెఏసి జిల్లా అధ్యక్షుడు దున్న శ్యామ్, జనరల్ సెక్రటరీ భూపాల్ రెడ్డి





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ :01 ( అన్వేషనేత్రం ):**

నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఇ జెఏసి జిల్లా అధ్యక్షుడు దున్న శ్యామ్, జనరల్ సెక్రటరీ భూపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టిజిఇ జెఏసి రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ , రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు ఇచ్చిన పిలుపు మేరకు సూర్యాపేట జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పింఛన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని నూతన పెన్షన్ విధానం ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టిజిఇ జెఏసి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు "పెన్షన్ విద్రోహ దినం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల నుండి పెన్షన్ కోసం జీవితాంతం సేవలు అందించిన అనంతరం వారి భవిష్యత్‌ను మార్కెట్ ఆధారిత పెన్షన్ విధానాలకు వదిలేయడం సమంజసం కాదని అన్నారు. ఉద్యోగులకు నిర్ధిష్టమైన, భద్రమైన పెన్షన్ అందించే పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం అత్యవసరమని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతపై అనిశ్చితి నెలకొంటుందని, సిపిఎస్ ను పూర్తిగా రద్దు చేసి, సెప్టెంబర్ 1,2024 తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా నియమింపబడి వారందరికీ పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలి అని నాయకులు కోరారు. ఉద్యోగుల న్యాయమైన పెన్షన్ హక్కు సాధించే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఇ జెఏసి నాయకులు మట్టపల్లి రాధాకృష్ణ, ఎస్.రవికుమార్, నాయిని ఆకాష్ వర్మ, కోడిరెక్క నాగేందర్, పి. కరుణాకర్ రెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె యాదగిరి, మాడిపడగ సైదులు, డాక్టర్ బట్టు గోపి, దర్శనం మల్లేష్, వేంకటరామ రెడ్డి, లక్ష్మయ్య, శ్యామ్ ప్రసాద్, అల్లి సతీష్, భూపతి వెంకటయ్య, నాందీపాటి రవి, కోడి మురళి, బాదే లింగయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# హామీల అమలులో రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యం

### సూర్యాపేట శాసనసభ్యులు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్: 01 ( అన్వేషనేత్రం ):**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని, వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పి హామీలను వెయ్యి రోజులు అయినప్పటికీ అమలు చేయలేదని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నిద్రలో కూడ కెసిఆర్ పేరు కలవరిస్తున్నాడని, కెసిఆర్ పేరు పలకకుండా ఆయన ఉండడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పిన ఆరు గ్యారంటిలు, 420 హామీలు అమలు చేయనందు కు నిరసనగా సెప్టెంబర్ రెండో తారీఖునుండి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ మూడవ తేదీన మిర్యాలగూడలో జరిగే రైతు మహాదర్న కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు అవుతారని ఆయన చెప్పారు. ఆంద్ర ప్రభుత్వం జలదోపిడికి పాల్పడుతున్నా రేవంత్ రెడ్డి పట్టించుకోవడంలేదని , నల్గొండ పాలమూరు జిల్లాలకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రకు నీళ్లు తరలిస్తుంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వలిగొండప్రాజెక్టు నిర్మాణంపై రేవంత్ రెడ్డి అభ్యంతరం చెప్పడం లేదని , దీనివలన నల్గొండ పాలమూరు జిల్లాల పై తీవ్రమైన ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ , పార్టీ నాయకులు ఉప్పల ఆనంద్, ఆకుల లవకుశ, గుర్రం సత్యనారాయణరెడ్డి, జీడి బిక్షం, నెమ్మాది బిక్షం, గాలి సాయి,బూర బాల సైదులు గౌడ్, ఎస్ కే బాషా,పలువురు నాయకులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### -దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాషాపొగు జాన్





**సంగారెడ్డి సెప్టెంబర్ 01 :**

దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాషాపొగు జాన్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాషాపొగు జాన్, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా, జిల్లా అధ్యక్షులుగా రామని అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కాషాపొగు జాన్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించాలని, ఇల్లు, ఇంటి స్థలం లేని దళిత జర్నలిస్టులకు ఇల్లు, ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.అలాగే దళిత జర్నలిస్టులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నూతన జిల్లా అధ్యక్షులు రామని అశోక్ మాట్లాడుతూ, దళిత జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ దళిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. దళిత జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సంఘం తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్న కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాపాక విజయరాజు , సీనియర్ జర్నలిస్టులు విలాస్, రాజు, అశోక్ తో పాటు పలువురు దళిత జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మరిపెడలో మేకల దొంగల ముఠా అరెస్ట్

### - కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి హత్యకు యత్నం

### - ఏడు మేకలు, హోండా అమేజ్ కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం.. నలుగురు నిందితుల అరెస్ట్

### - సిఐ పవన్ కుమార్, ఎస్ఐ గంద్రాతి , ఎస్.కె. మహేబుబి

**డోర్నకల్ /మరిపెడ సెప్టెంబర్ 1:**

రాత్రి వేళల్లో కారులో సంచరిస్తూ ఇళ్ల వద్ద కట్టేసి ఉంచిన మేకలు, గొర్రెలను దొంగతనం చేస్తున్న ముఠాను మరిపెడ పోలీసులు అరెస్ట్ చేశారు. వాహన తనిఖీల సమయంలో పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే క్రమంలో పోలీస్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించిన నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ రవితేజ గాయపడగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.మరిపెడ పోలీసులను జిల్లా ఎస్పీ డాక్టర్ శ్రీ శబరీష్ పి. ఐపీఎస్, తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ అభినందించారు. కేసు వివరాలను మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ వెల్లడించారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో పెట్రోలింగ్‌లో భాగంగా రాజీవ్ సెంటర్ వద్ద మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్, పీసీ జీ. రవితేజ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో కురవి రోడ్డు వైపు



నుంచి మరిపెడ వైపు ఒక తెల్లరంగు హోండా అమేజ్ కారు అధిక వేగంతో వచ్చింది. కారుకు ముందు, వెనుక నంబర్ ప్లేట్లను గుడ్డతో కప్పి ఉండటాన్ని పోలీసులు గమనించారు.పోలీసులు కారును ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ డ్రైవర్ ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును వెంబడించారు. సుమారు గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు సైరన్ మోగిస్తూ, హారన్ కొడుతూ కారును ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా మరిపెడ టౌన్ నుంచి కార్గిల్ సెంటర్ మీదుగా సూర్యాపేట రోడ్డులోకి వెళ్లాడు. అనంతరం మళ్లీ





మరిపెడ గ్రామం వైపు తిరిగి, అక్కడి నుంచి సూర్యాపేట హైవేపైకి వెళ్లి సూర్యాపేట వైపు దూసుకెళ్లాడు.కారు వెనుక భాగాన్ని గుడ్డతో కప్పి ఉండటంతో డిక్కీలో ఏదైనా అనుమానాస్పద వస్తువు ఉండొచ్చని పోలీసులు అనుమానించారు. అంతేకాకుండా అధిక వేగంతో వెళ్తున్న కారు ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొంటే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉండటంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.ఈ క్రమంలో తానం చెర్ల శివారులో పోలీసులు కారును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీస్ వాహనాన్ని ముందుకు తీసుకెళ్లి కారును నిలిపేందుకు ప్రయత్నించగా నిందితులు కొద్దిసేపు కారును నెమ్మదించారు. దీంతో పోలీస్ వాహనం వెనుక సీటులో ఉన్న కానిస్టేబుల్ రవితేజ కుడివైపు డోర్ తెరిచి కిందకు దిగారు. కారులోని డ్రైవర్‌ను దిగాలని చేతితో సిగ్నల్ ఇచ్చారు.అయితే నిందితులు కారును మళ్లీ వేగంగా కానిస్టేబుల్ రవితేజ వైపు నడిపించారు. అప్రమత్తమైన కానిస్టేబుల్ పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయినప్పటికీ కారు ఆయన కుడి చేతికి తగలడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.పోలీసులు గట్టి హెచ్చరికలు చేయడంతో కొంతదూరం వెళ్లిన నిందితులు చివరకు తానం చెర్ల గ్రామ శివారులో, మరిపెడ--సూర్యాపేట రహదారి ప్రాంతంలో కారును నిలిపారు. కారును తనిఖీ చేయగా నలుగురు వ్యక్తులు ఉండటంతో పాటు, కారులో కిక్కిరిసి ఏడు మేకలను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మేకలపై ఇద్దరు వ్యక్తులు కాళ్లతో తొక్కి కూర్చుని ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మేకలు ఎక్కడివని, పోలీసులను చూసి ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించగా నిందితులు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో పోలీసులు తమ వద్ద ఉన్న ట్యాబ్ పాపిలాన్ పరికరం ద్వారా నిందితుల వేలిముద్రలను పరిశీలించారు.వేలిముద్రల పరిశీలనలో భూక్యా జగదీష్‌పై భూర్గంపాడు, నర్సంపేట, డోర్నకల్, ములకలపల్లి, దుగ్గొండి పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో ఐదు కేసులు ఉన్నట్లు గుర్తించారు. మరో నిందితుడు భూక్యా శ్రీధర్‌పై రెండు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.దీంతో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, తాము భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఒడ్డురామారం గ్రామానికి చెందిన వారమని వెల్లడించారు. మేకలు, గొర్రెలు దొంగతనం చేసేందుకు నలుగురూ కలిసి హోండా అమేజ్ కారులో కురవి, మరిపెడ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.ఇటీవల ఎల్లారిగూడెంలో ఓ ఇంటి వద్ద మేకలను దొంగతనం చేసినట్లు నిందితులు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. జల్సాలకు అలవాటు పడి, కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మేకలు, గొర్రెలను దొంగతనం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. అరెస్టైన నిందితులు

1. భూక్యా జగదీష్, తండ్రి రాములు, వయసు 33 సంవత్సరాలు, వ్యవసాయం, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం, ములకలపల్లి మండలం. 2. ధరవత్ అశోక్, తండ్రి రాములు, కారు డ్రైవర్, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం, ములకలపల్లి మండలం. 3. భూక్యా ప్రసాద్, తండ్రి సక్రు, వయసు 25 సంవత్సరాలు, కూలీ, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం, ములకలపల్లి మండలం. 4. లావుడియా శ్రీధర్, తండ్రి బాలు, వయసు 28 సంవత్సరాలు, తాపీ మేస్త్రీ, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం, ములకలపల్లి మండలం.నిందితుల నుంచి ఒక హోండా అమేజ్ కారు, మూడు సెల్‌ఫోన్లు, సుమారు రూ.1 లక్ష విలువైన ఏడు మేకలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులు పోలీస్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి హత్యకు ప్రయత్నించిన ఘటనపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ ఎల్. పవన్ కుమార్ తెలిపారు. మేకల దొంగతనాలకు సంబంధించి మరిన్ని కేసులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# ఉగ్రవాదం ఏ దేశానికీ వ్యూహాత్మక ఆయుధం కారాదు:ప్రధాని మోదీ



ఉగ్రవాదాన్ని ఏ దేశమూ తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ఉపయోగించుకోరాదని, ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తూ మద్దతుగా నిలిచే దేశాలకు ప్రపంచం స్పష్టమైన సందేశం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో ప్రసంగించిన ఆయన, ఉగ్రవాదంపై పోరులో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని తేల్చిచెప్పారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని కేవలం చర్య-ప్రతిచర్య అనే పరిమిత కోణంలో చూడకుండా, దాని మూల వ్యవస్థను సమూలంగా విచ్ఛిన్నం చేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి అందే ఆర్థిక వనరులను నిలువరించడం, తీవ్రవాద భావజాల వ్యాప్తిని అడ్డుకోవడం, కొత్తవారిని రిక్రూట్ చేసుకోకుండా చేయడం మరియు ఉగ్రవాదులకు రక్షణ కల్పించే సురక్షిత స్థావరాలపై ఉక్కుపాదం మోపడం ద్వారానే ఈ పెను ముప్పును నిర్మూలించగలమని పేర్కొన్నారు.యూరేషియా ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరతలు కొనసాగాలంటే అఫ్ఘానిస్థాన్‌లో పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని, అక్కడి ప్రజల మానవతా అవసరాలకు భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రధాని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభంపై మాట్లాడుతూ.. ఏ ఒక్క ప్రాంతంలో మొదలైన ఘర్షణ అయినా అక్కడితో ఆగదని, అది ప్రపంచ ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలపై పెను ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. యుద్ధాలతో ఎప్పటికీ సమస్యలు పరిష్కారం కావని, కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాశ్వత శాంతి సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా యువత భవిష్యత్తుతో పాటు ప్రాంతీయ భద్రతకు తీవ్ర సవాలుగా మారిందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్ ట్రాఫికింగ్, వ్యవస్థీకృత నేరాలు, సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు ఎస్‌సీఓ యంత్రాంగాలను కేవలం చర్చలకే పరిమితం చేయకుండా వేగవంతమైన కార్యాచరణ వేదికలుగా మార్చాలని పిలుపునిచ్చారు. ఎస్‌సీఓ సహకారం ద్వారా లభించే ఫలితాలు నేరుగా సామాన్య ప్రజలకు చేరాలని, యువతకు నూతన అవకాశాలు, రైతులకు ఆధునిక సాంకేతికత, సరికొత్త మార్కెట్లు అందుబాటులోకి వచ్చినప్పుడే సంస్థ లక్ష్యం నెరవేరుతుందని వివరించారు. కాగా, ఈ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు ఒకే వేదికపై ఫొటో దిగడం అంతర్జాతీయంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# దాడులతో ప్రజాస్వామ్యాన్ని హరిస్తారా?

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలి.. రాపోలు నవీన్ కుమార్



**నేరేడుచర్ల :- సెప్టెంబర్ 1 అన్వేషనేత్రం**

అమర ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి వ్యక్తిత్వం, జీవితం, ఆలోచనా విధానం మరియు రాజ్యాంగ నిర్మాణంపై గత కొన్ని రోజులుగా కావాలనే దురుద్దేశపూర్వకంగా సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం, అసత్య కథనాలు ప్రచారం చేస్తున్న అమర ప్రసాద్ అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు నేరేడుచర్ల ప్రధాన కూడలి నందు దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాపోలు నవీన్ కుమార్ బిసి జేఏసీ రాష్ట్ర నాయకులు దూళిపాళ ధనుంజ నాయడు మాట్లాడుతూ హమారా ప్రసాద్ అనే వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి గురించి తప్పుడు మరియు నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడంతో పాటు, "కల్పిత నాయకుడు" అనే పుస్తకాన్ని ప్రచురించి త్వరలో విడుదల చేస్తానంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ప్రతిష్టను దెబ్బతీసే విధంగా అసత్య ప్రచారం చేయడం సమాజంలో అపోహలు, విద్వేషాలు మరియు అశాంతికి దారితీసే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. కాబట్టి ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి, చట్టపరంగా నేరం నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కలిమ్ మర్రి నాగేశ్వరావు పల్లెపంగ నాగరాజు పెరుమాళ్ళ సతీష్ కుమార్ యడవెల్లి శ్రీకాంత్ రామ్ సైదులు అవిరెండ్ల నాగేంద్ర బాబు అరె శ్రీకాంత్ చిలకరాజు శ్రీను రెడపంగ దానియేలు తకెళ్ళ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

### బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుణగంటి పృథ్వీ

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ :01 (అన్వేషనేత్రం): ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, అయితే నిరసన తెలిపినందుకు ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులు చేయడం, పార్టీ కార్యాలయాలపై దౌర్జన్యానికి పాల్పడటం కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుణగంటి పృథ్వీ అన్నారు.మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు నిరసన వ్యక్తం చేసినందుకు, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడటం అత్యంత హేయమైన, పిరికిపంద చర్య అని విమర్శించారు.దాడి సమయంలో నాగం వర్షిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను దూషించడంతో పాటు, ఆయన తల్లిదండ్రులు, మేనమామపై దాడి చేసి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారని ఆరోపించారు. అదేవిధంగా బీజేపీ కార్యాలయంపైకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చి దౌర్జన్యంగా వ్యవహరించడం, గుడ్లు విసరడం వంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రజాస్వామ్యంలో ఒక పార్టీకి మరో పార్టీపై విమర్శలు చేసే, నిరసన తెలిపే హక్కు ఉంటుందని, అంతేగానీ ప్రత్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడటం కొత్త రాజకీయ సంస్కృతికి దారితీస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా



కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు పాలన అందించాల్సిన బాధ్యత కలిగిన వ్యక్తి అని, గుండాలను ప్రోత్సహించి ప్రత్యర్థులపై దాడులు చేయించడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజలు తగిన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలు భయభ్రాంతులకు గురై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ కార్యకర్తలు నిరంతరం పోరాడుతారని గుణగంటి పృథ్వీ అన్నారు. బీజేపీ కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తలపై దాడులను సహించేది లేదని స్పష్టం చేశారు.నల్లగొండలో జరిగిన ఘటనలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే సూర్యాపేటలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి, బీజేపీ కార్యకర్తలకు మధ్య జరిగిన ఘర్షణల్లో దౌర్జన్యానికి పాల్పడిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రుక్మారావు, మన్మథ రెడ్డి, పాండురంగ చారి, దాసరి వెంకన్న, కోడి లింగయ్య, బాలాజీ తన్నీరు వాసుదేవ్, పరశురాం, రవివర్మ, బోర రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ బుర్రి చైతన్యకు పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

### మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసిన పార్టీ శ్రేణులు

నల్లగొండ, సెప్టెంబర్ 1 (అన్వేషనేత్రం ప్రతినిధి): నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు మేయర్‌ను పూలబొకేలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ





సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ చైతన్య శ్రీనివాస్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆమె కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప మేయర్ మహమ్మద్ అశ్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గుమ్ముల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, మారగోని నవీన్‌గౌడ్, సమద్, అల్లి మల్లికార్జున్‌యాదవ్, ఖయ్యూం బేగ్, ఆలకుంట్ల నాగరాజు, ఇంతియాజ్, పాలకుంట్ల నాగరత్నం రాజు, రేగట్టే లింగస్వామిగౌడ్, ఇబ్రహీం, గుండెబోయిన పుష్పలత వెంకన్నయాదవ్, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్, మామిడి కార్తీక్, ఇర్ఫాన్, వజ్జ రమేష్‌యాదవ్, పాలకూరి సుమలత సంతోష్, ప్రదీప్‌నాయక్, చిన్నాల జానయ్య, నంద్యాల వీరబ్రహ్మానందరెడ్డి, సంకు ధనలక్ష్మి, పాదం అనిల్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, వంగాల అనిల్‌రెడ్డి, కంచర్ల ఆనంద్‌రెడ్డి, పెరిక చిట్టితో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నేరేడుచర్లలో పెన్షన్ విద్రోహ దినం.





**నేరేడుచర్ల:- సెప్టెంబరు 1 అన్వేషనేత్రం**

టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నేరేడుచర్ల మండలంలో పెన్షన్ విద్రోహ దినాన్ని నల్లబ్యాడ్జీలు ధరించి నిర్వహించారు.మండల విద్యా వనరుల కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం.బాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఆర్.శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శి బి.అక్కయ్య బాబు, ఎన్.నరసింహారావు, కె.వెంకటేశ్వరరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, రషీద్ ఖాన్, ప్రతాప్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా జెడ్పీహెచ్ఎస్ నేరేడుచర్ల పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో ఉపాధ్యాయులు షౌరీ, రషీద్ ఖాన్, వెంకటేశ్వరరావు, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, జానయ్య, మాధవి, నాగమణి, యాదగిరి, శ్రీనివాసరావు, లాల్‌సాహెబ్, పద్మ పాల్గొన్నారు.జెడ్పీహెచ్ఎస్ పెంచికల్ దిన్న పాఠశాలలో కూడా పెన్షన్ విద్రోహ దినం పాటించారు. ప్రధానోపాధ్యాయులు ఎల్.శ్రీనివాసరావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసనలో పాల్గొన్నారు. సీపీఎస్ అంతం – టీఎస్‌యూటీఎఫ్ పంతం, పాత పింఛన్ విధానం అమలు చేయాలి.

## పేదల కళ్లలో వెలుగులు

### నిరుపేదలకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ:

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని

**నల్లగొండ,సెప్టెంబరు- 01(అన్వేషనేత్రం ప్రతినిధి):**

నల్లగొండ పట్టణంలోని ఇరవై ఎనిమిదవ వార్డులో నిరుపేదలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ అగర్వాల్ హాస్పిటల్ సహకారంతో ముందుగా కంటి పరీక్షలు నిర్వహించి, అనంతరం మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కంటి అద్దాలను అందజేశారు. ఇరవై ఎనిమిదవ వార్డు కార్పొరేటర్ గుండెబోయిన పుష్పలత వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నిరుపేదలకు కంటి అద్దాలను పంపిణీ చేస్తూ ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తన జన్మదినాన్ని పురస్కరించుకుని వార్డు కార్పొరేటర్ సొంత ఖర్చులతో కంటి అద్దాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పేదలు, బడుగు, బలహీన





వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేసే వారికి తనవంతు సహకారం చేస్తానని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి వారి ఆదరాభిమానాలను పొందాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వన్‌టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్ హాజరై నిరుపేదలకు కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు ఇరవై ఎనిమిదవ వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే ఒక వరుసలో పన్నెండు, మరో వరుసలో పదహారు చొప్పున మొత్తం ఇరవై ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. పేదల అవసరాలను, వార్డులోని మౌలిక సదుపాయాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.మేయర్ భవిష్యత్‌లో రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, హెడ్‌మాస్టర్ యూసుఫ్, ఇరవై తొమ్మిదవ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి సెఫీతో పాటు పార్వతమ్మ, రాజ్యలక్ష్మి, షమీమ్, యాదయ్య, వార్డులో నాయకులు, కార్యకర్తలు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీపై పెట్టిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ :01 ( అన్వేషనేత్రం ):**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై దురుద్దేశపూర్వకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన ఘటనపై రాహుల్‌గాంధీ ఉత్తరాఖండ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారని తెలిపారు. దళిత నేతగా, పలుమార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన ఖర్గేను అవమానించడాన్ని ప్రశ్నించినందుకు రాహుల్‌గాంధీపై బీజేపీ పాలిత రాష్ట్రంలో అక్రమంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అమానుషమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రశ్నించే గొంతుకలను అణచివేసే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ తొలగించకపోతే సూర్యాపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు చిలుముల సునీల్ రెడ్డి, మహమ్మద్ తాయారుబిన్ ఫారుక్, వల్దాస్ లక్ష్మీ శ్రీనివాస్, బానోత్ సైదులు నాయక్, పోల గాని కృష్ణ,కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, నిమ్మికల్ దేవాలయ కమిటీ చైర్మన్ తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం,మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఎండి అంజాద్ అలీ, బైరు వెంకన్న గౌడ్, గడ్డం వెంకన్న,రుద్రంగి రవి, యుగంధర్,తదితరులు పాల్గొన్నారు.



# 1000 రోజుల పాలన పేదల అభివృద్ధి కోసమే: డాక్టర్ పిడమర్తి రవి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజుల విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా హిమాయత్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు . ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజాపాలనలో వెయ్యి రోజులు పేదల కోసమే ప్రజా పాలన జరిగిందని పేదలకు ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు మహిళ ఉచిత బస్సు సౌకర్యం మరియు అనేకమంది పేదల భూములను కార్పొరేట్ శక్తులు కబ్జాకు చేస్తున్న సందర్భంలో హైదరాబాద్ పేదల భూములను రక్షించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై ప్రగాఢ నమ్మకం పెరిగిందని రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలి ఆధ్వర్యంలో చేపట్టే ఎన్నికల్లో




కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజా పాలన ప్రతి పేదవారు నేరుగా ప్రభుత్వ ని కలిసి తమ విజ్ఞప్తులను సమర్పించుకునే సమయం ఇస్తున్నందుకు రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ నాయకులు బట్టు శ్రీహరి నాయక్, శ్రీధర్ గౌడ్, సతీష్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్ చందర్ నాయక్ నక్క మహేష్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి కనుమరుగు.

**కనుమరుగవుతున్న ప్రభుత్వ రంగ సంస్థల ఉనికి.**

**రోజుకో ప్రభుత్వ రంగ సంస్థను వీలినాలకు శ్రీకారం చూడుతున్న ప్రభుత్వం.**

**ఆందోళనల్లో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు.**

తెలంగాణ ప్రజల వాకిట సేవలు అందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల వీలినాలు ఉద్యోగుల పాలిట శాపంగా మారుతూ వస్తుంది.

పేదలకు, రైతులకు, పారిశ్రామిక రంగాలకు ఎంతో ఊతం ఇస్తూ వస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల మనగుడ రోజు రోజుకు కనుమరుగవుతూ వస్తున్నాయి. .ఉన్నత లక్ష్యాలతో ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన ప్రజలకు, రైతులకు, ప్రభుత్వ వ్యవస్థలకు అత్యుత్తమ సేవలు అందించే అలోచనలతో సంస్థల మనగడ ప్రారంభమయ్యింది. ప్రభుత్వ రంగ సంస్థలకు జీవం పోయడానికి ప్రభుత్వం కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ప్రజలకు, ప్రజా సేవలకు మరింతగా ఉపయోగపడేవిధంగా తయారు చేసే ఆస్కారం ఉన్నప్పటికి, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయక పోవడం వల్ల ఇటు ప్రజలకు, రైతు సంబంధిత సేవలకు విఘాతం కలుగుతుంది.ఒకప్పుడు ఎంతో వెలుగు వెలిగిన ప్రభుత్వ రంగ సంస్థలు పాలకుల నిర్లక్ష్యానికి బలి పశువులుగా మారుతున్నాయి. తెలంగాణలో 93 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి. వీటిలో 26 సంస్థలు కుల సంఘాల ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మరో 6 నుంచి 7 ప్రభుత్వ రంగ సంస్థలు స్వయం పతిపత్తిగా కొనసాగుతున్నాయి. మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ చేయూత తో లాభధాల్లోను, మరికొన్ని మరికొన్నింటి మనుగడ కనుమరుగ వుతున్నాయి. .ప్రభుత్వ రంగ సంస్థలు కార్పోరేషన్లలో తొలిసారిగా జరిగిన ఉద్యోగ నియామకాలే కాని.. అనంతరం తిరిగి కొత్త నియామకాలు చేపట్టక పోవడంతో చాల మంది అవుట్ స్టోరింగ్ ఉద్యోగులతో పనుల నిర్వాహణ జరుగుతు వస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతానికి పరిస్థితులకు అనుగుణంగా చేయూత అందించాల్సిన ప్రభుత్వాలు కేవలం రాజకీయ ఉపాధి కేంద్రాలుగా కొనసాగిస్తూ వస్తు ఉండడంతో అనేక సంస్థలు అర్థికంగా బలంగా లేక డీలా పడిపోతు వస్తున్నాయి. ఇలా డీలా పడుతూ వస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం మరో సంస్థలో వీలినానికి శ్రీకారం చుడుతూ వస్తుంది.ఈ మధ్యనే ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను హకాలో



వీలినం చేశారు. ఇప్పుడు అగ్రోస్‌ను సీడ్ కార్పొరేషన్‌లో వీలినం చేయడానికి సన్నాహాలు చేస్తుంది. ఇలా ఒక్కొక్కటి వీలిలమవుతున్న సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల భయాందోళనలకు గురవుతున్నారు.టూరిజం, సివిల్ సప్లయి, మార్క్‌ఫెడ్, సీడ్ కార్పొరేషన్, ఆగ్రోస్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు రైతులకు ఎంతో చేయూత అందించిన చరిత్ర ఉంది. ఈ సంస్థలకు జీవం పోయడానికి ప్రభుత్వం కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి సంస్థలను బలోపేతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు కలిసి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీటి జీవన్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కొత్త ఉద్యోగుల నియమకాలు చేపట్టి నిరుద్యోగులకు ఉపాధి కల్పించి కార్పొరేషన్లను అభివృద్ధి బాటలో నడిచే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జీటి జీవన్ కోరుతున్నారు.




గౌరవ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఆా.ఎబఎ గారి నేతృత్వంలో జరిగిన ధర్నా కార్య క్రమం వెంకట్రామ జంక్షన్ లో పెద్ద ఎత్తున జరిగింది ఇట్టి కార్య క్రమంలో నల్లగొండ రమేష్ గారు వివిధ మండలాల అధ్యక్షులు ౦ఎ ౧వజుాఖతీఎవత్ చైర్మెన్ జిల్లా కమిటీ ౹ాజ డిపార్ట్మెంట్ నాయకులు నేతలు మహిళలు యువత అర్బన్ నాయకులతో పాటు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ౹ాజ డిపార్ట్మెంట్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ గారు పాల్గొన్నారు

# గత పాలకుల తప్పులకు చెక్.. భూ ప్రక్షాళనకు కాంగ్రెస్ శ్రీకారం!

**ధరణి పేరుతో జరిగిన అక్రమాలకు ముగింపు.. భూభారతితో పారదర్శకత**

**హైడ్రాతో ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ స్థలాలకు విముక్తి**

**నారాయణపురంలో 780 మంది రైతులకు 1,337 ఎకరాల పంపిణీ**

**వసంతనగర్ 22-ఏ భూముల సమస్యకు సైతం శాశ్వత పరిష్కారం**

**కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు గాదె శివ వెల్లడి**

**కూకట్‌పల్లి:**

గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా జరిగిన భూ వ్యవహారాలను ప్రక్షాళన చేస్తూ, ప్రతి ఒక్కరికీ చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా అడుగులు వేస్తోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు, వసంతనగర్ డివిజన్ నేత గాదె శివ స్పష్టం చేశారు. ఫారెస్ట్, అసైన్డ్, ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా మార్చుకుని, ధరణి రికార్డుల్లో చేర్చి రైతుబంధును సైతం అక్రమంగా పొందారని ఆయన గత పాలకుల తీరుపై మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాలు, రైతు రుణమాఫీ అని చెప్పి గత ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం



చేసిందని ఆయన విమర్శించారు.

**ప్రజల భూమి ప్రజల హక్కు..**

ప్రజల భూమి ప్రజల హక్కు అనే సిద్ధాంతంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని శివ తెలిపారు. గతంలో అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురైతే, వాటిని హైడ్రా ద్వారా తిరిగి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ధరణి రికార్డులను రద్దు చేసి, భూభారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా సర్కారు కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**అమలైన నారాయణపురం రైతుల కల..**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అనడానికి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతుల కలను నెరవేర్చడమే నిదర్శనమని శివ గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా నారాయణపురం గ్రామంలోని భూములన్నింటినీ ధరణి కారణంగా ఫారెస్ట్ జాబితాలో చేర్చారు. దీంతో ఏళ్ల తరబడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, 780 మంది రైతులకు ఏకంగా 1,337 ఎకరాలకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క స్వయంగా అందజేశారు. దశలవారీగా భూ సర్వే చేపట్టి క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టా బుక్ అందజేస్తామని మంత్రి పొంగులేటి ఆ సభలో స్పష్టం చేశారు.

**వసంతనగర్ భూములపై స్పష్టమైన హామీ..**

వసంతనగర్ భూముల విషయంలోనూ ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గాదె శివ భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ భూములకు అడ్డంకులు ఏర్పడ్డాయని, వీటిని 22ఏ జాబితాలో చేర్చిన పాపం గత పాలకులదేనని విమర్శించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. వసంతనగర్ భూముల సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. హామీ అంటే కాంగ్రెస్ హామీ అమలు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అభివర్ణించారు. అక్రమాలు, అన్యాయాలకు ముగింపు పలికి నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని, వసంతనగర్ ప్రజలంతా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బండి రమేష్ వెంట నడవాలని గాదె శివ పిలుపునిచ్చారు.

# జోనా ఫౌండేషన్ సేవలు పేద ప్రజల హృదయాలలో చిరకాలం నిలుస్తాయి

**పేదల వైద్య సేవలకు ఉచిత అంబులెన్స్ అందించడం అభినందనీయం**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ : 01 ( అన్వేషనేత్రం ):**

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వారి హృదయాల్లో చిరకాల సేవలు నిర్వహిస్తున్న జోనా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ దంపతుల కుమారుడు గండూరి జోనా 6వ వర్ధంతి సందర్భంగా అంబులెన్స్ రెండు ఫ్రీజర్ బాక్స్ లు అక్షర ఫౌండేషన్ వాళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జోనా వర్ధంతిని పురస్కరించుకుని పేదల కోసం రూ.26 లక్షల వ్యయంతో ఉచిత అంబులెన్స్‌ను, రూ.1.80 లక్షల వ్యయంతో రెండు ఫ్రీజర్ బాక్సులను అందించడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమన్నారు. అత్యవసర సమయాల్లో పేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. సుమారు 330 మంది పేదలకు ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సేవాభావంతో చేపట్టే ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని, సమాజంలోని పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం ఉచిత అంబులెన్స్, రెండు ఫ్రీజర్ బాక్సులను అక్షర ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గండూరి కుటుంబ సభ్యులు గండూరి రామస్వామి గండూరి కృపాకర్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వై వెంకటేశ్వర్లు,మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, పెన్ పహాడ్ మండల మాజీ ఎంపీపీ నెమ్మది బిక్షం,మాజీ జడ్పిటిసి జీడి బిక్షం కౌన్సిలర్స్ ఈద ప్రవీణ్, పోతరాజు ఇందు శ్రీ అనిల్, గాలి సాయి, తాహెర్ పాషా టిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు సవరణ సత్యనారాయణ కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్ ఉప్పల ఆనంద్, అంగిరేకుల నాగార్జున, కెక్కిరేణి నాగయ్య, ఎస్.కె భాషా, పలువురు నాయకులు పాల్గొని గండూరి ప్రీతంకు నివాళులర్పించారు.










# పాత నేరేడుచర్ల శ్రీ ఆంజనేయస్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు

**నేరేడుచర్ల :- సెప్టెంబర్ 1 అన్వేషనేత్రం**

పాత నేరేడుచర్ల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో

ది. 1.9.2026 మంగళవారం శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు, ఆలయ పూజారి లక్ష్మి నరసింహ చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూల మాలలతో వివిధ రకాల పూలతో శ్రీ ఆంజనేయ స్వామి ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు, పాత నేరేడుచర్ల శ్రీ ఆంజనేయస్వామిని పట్టణ ప్రాంతంలోని భక్తులు దర్శించుకున్నారు, ఆలయ పూజారి ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన ఆంజనేయ స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై స్టే ఎత్తివేత

**ప్రభుత్వానికి హైకోర్టు సీజే ధర్మాసనంలో భారీ ఊరట!**

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ బెంచ్ విధించిన స్టే ఉత్తర్వులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని డివిజన్ ధర్మాసనం పూర్తిగా రద్దు చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.ఈ పథకాల అమలు కోసం 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన 8 జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌పై గత నెల 12న సింగిల్ జడ్జి స్టే విధించడంతో పాటు, లబ్ధిదారులకు ఎలాంటి నిధులు విడుదల చేయరాదని ఆదేశించారు. దీనిపై డివిజన్ బెంచ్ ఎదుట ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ. సుదర్శన్‌రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. పేద ప్రజల సంక్షేమం కోసం దాదాపు 12 ఏళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఈ పథకాల వల్ల పిటిషనర్‌కు ఎలాంటి వ్యక్తిగత నష్టం వాటిల్లలేదని, ఆయన ప్రాథమిక హక్కులకు భంగం కలగలేదని స్పష్టం చేశారు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

## ఆట





# ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్!




వాటాల విషయంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మహేంద్ర సింగ్ ధోనీ విభేదాలు తలెత్తాయని ప్రచారం జరిగింది. సీఎస్‌కేలోని 25 శాతం షేర్లను తనకు అమ్మాలని ధోనీ కోరగా.. ఆ టీమ్ యజమాన్యం నిరాకరించిందని వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు ఈ వార్తలపై ధోనీ గానీ, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ కానీ స్పందించలేదు. దాంతో సీఎస్‌కేకు ధోనీ దూరంగా ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్ ఇచ్చినట్లు తాజాగా ఓ నివేదిక బయటకు వచ్చింది. సీఎస్‌కే హెడ్ కోచ్‌గా లేదా కన్సల్టెంట్‌గా బాధ్యతలు చేపట్టాలని ధోనీకి ఆఫర్ ఇచ్చినట్లు సదరు రిపోర్ట్ పేర్కొంది. అయితే ఆఫర్‌పై ధోనీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని, దాంతో సీఎస్‌కే మేనేజ్‌మెంట్ వేచి చూస్తుందని తెలుస్తోంది. ధోనీ నుంచి నిర్ణయం వెలువడిన తర్వాత వచ్చే సీజన్‌కు సంబంధించిన ప్రణాళికలను, వేలంలో అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎస్‌కే నిర్ణయించినట్లు సమాచారం. ఐపీఎల్ 2026 సీజన్‌లోచెన్నై సూపర్ కింగ్స్ తీవ్రంగా నిరాశపర్చింది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలు మాత్రమే సాధించి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్ చరిత్రలోనే ధోనీ ఒక సీజన్ మొత్తం ఆడకపోవడం ఇదే తొలిసారి.అంతేకాకుండా హెడ్ కోచ్‌గా 19 ఏళ్లు సేవలందించిన స్టీఫెన్ ఫ్లేమింగ్ కూడా జట్టును వీడాడు. 2008లో ఆటగాడిగా జట్టులోకి వచ్చిన ఫ్లెమింగ్.. 2009లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణలో సీఎస్‌కే ఐదు టైటిళ్లు గెలిచింది. అతను తప్పుకోవడంతో సీఎస్‌కే కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎస్‌కే ఆఫర్‌పై ధోనీ తేల్చిన తర్వాతే కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టాలనుకుంటుంది. ధోనీ ఏ విషయం చెప్పకపోవడం వల్ల సీఎస్‌కే కార్యకలాపాలన్నీ ఆగిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఐపీఎల్ 2027 సీజన్‌లో ధోనీ ఆటగాడిగా కొనసాగడనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ధోనీని సీఎస్‌కే అనామక ప్లేయర్‌గా రూ.4 కోట్లకు తీసుకుంది. 2024 నుంచి 2026 వరకు సీఎస్‌కే వరుసగా ప్లే ఆఫ్స్ చేరలేదు. ఈ క్రమంలోనే ధోనీ పర్యవేక్షణలో జట్టును పునర్నిర్మించాలని సీఎస్‌కే యోచిస్తోంది.


# ఒలింపిక్స్ తో పాటు తర్వాతి టీ20 వరల్డ్ కప్ వరకు కెప్టెన్‌గా ఉంటా

## స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్

భారత టీ20 జట్టుకు 2026 వరల్డ్ కప్ ట్రోఫీని అందించిన స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అనూహ్యంగా జట్టుకే దూరం కావడంపై తొలిసారి మనసులో మాట బయట పెట్టాడు. అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్నప్పటికీ అతడి స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను సెలెక్టర్లు టీ20 కెప్టెన్‌గా నియమించడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల నుంచి సూర్యను పూర్తిగా తప్పించారు. ఈ నిర్ణయం తీసుకున్న కొన్ని నెలల తర్వాత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో జరిగిన ఇంటర్వ్యూలో సూర్యకుమార్ తన మనసులోని భావాలను పంచుకున్నాడు. జట్టు జాబితాలో తన పేరు లేకపోవడం చూసినప్పుడు తాను కేవలం నవ్వుకున్నానని చెప్పాడు. రాబోయే ఒలింపిక్స్ తో పాటు తర్వాతి టీ20 వరల్డ్ కప్ వరకు తనే కెప్టెన్‌గా ఉంటానని అనుకున్నట్లు సూర్య వ్యాఖ్యానించాడు. "జట్టు ప్రకటనలో నా పేరు కనిపించనప్పుడు ఒక్కసారిగా నవ్వాను. కెరీర్‌లో ఒత్తిడి వచ్చినప్పుడల్లా నేను రిలాక్స్‌గా ఉంటూ నవ్వుతూనే ముందుకు సాగాను. 2026 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత మరో రెండేళ్ల పాటు జట్టును ముందుకు తీసుకెళ్లగలనని, ఒలింపిక్స్ లో సారథ్యం వహిస్తానని భావించాను. అయితే సెలెక్టర్ల ఆలోచనలు వేరేలా ఉన్నాయి. భవిష్యత్తు కోసం వేరొకరు కెప్టెన్‌గా ఉంటే మంచిదని వారు భావిస్తే ఆ నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను. మరొకరి నాయకత్వంలో జట్టు బాగా ఆడితే నాకు ఎలాంటి సమస్యా లేదు" అని సూర్యకుమార్ తెలిపాడు. తన తర్వాత కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని, అతడు గొప్ప లీడర్ అని సూర్య కొనియాడాడు. అయితే సెలెక్టర్ల నిర్ణయం తనను తీవ్రంగా నిరాశపరిచిందని తెలిపాడు. "రెండేళ్ల కాలంలో మేం ఒక్క ద్వైపాక్షిక సిరీస్ కూడా ఓడిపోలేదు. ఆసియా కప్, టీ20 వరల్డ్ కప్ టైటిళ్లు గెలిచాం. అంతా సవ్యంగా సాగుతున్న సమయంలో ఇలాంటి ఆకస్మిక మార్పు ఎందుకు జరిగిందో నాకు అర్థం కాలేదు. గెలవగానే ఇది ఎలా సాధ్యం అనే ప్రశ్న నా మనసులో మెదిలింది. దాదాపు నెలన్నర పాటు ఇంట్లోనే కూర్చుండిపోయాను. బంధువులు, స్నేహితులు వచ్చి ఓదార్చినా వారు వెళ్లిన తర్వాత ఒంటరిగా ఉన్నప్పుడు ఆ బాధ తెలిసేది" అని పేర్కొన్నాడు. జట్టు ఎంపిక ప్రకటనకు రెండు మూడు రోజుల ముందే సెలెక్టర్లు తనకు ఫోన్ చేసి 'ఇక వేరే మార్గంలో ముందుకెళ్లే సమయం వచ్చింది' అని చెప్పినట్లు సూర్యకుమార్ తెలిపాడు. "వారు అలా చెప్పినప్పుడు నేను ఏమాత్రం కోపగించుకోలేదు. జట్టు మంచి కోసం వారు ఒక నిర్ణయం తీసుకున్నారు. దాన్ని హుందాగా స్వీకరించాను. దేశం కోసం ఆడటానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను. మీరు ఎప్పుడు పిలిచినా బరిలోకి దిగేందుకు నా బ్యాట్ సిద్ధంగా ఉంటుంది" అని సూర్యకుమార్ తెలిపాడు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA




# నాగార్జున వందో సినిమా

## కింగ్ 100 గ్లింప్స్ విడుదల

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ప్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.




# ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434